గాయపడిన విద్యార్థి మృతి

సీతంపేట : మండలంలోని నాయుడు మల్లి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన సవర నవదీప్ (15) మంగళవారం శ్రీకాకుళం కిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు డిడి జి.మంగవేణి తెలిపారు. ఈనెల 17న నాగుల చవితి సందర్భంగా తన స్వగ్రామైన అక్కన్నగూడ వెళ్లాడని, అక్కడ నుంచి బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు గాయమైందన్నారు. వెంటనే సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చేర్పించగా, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం కిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే ఆసుపత్రికి వెళ్లి నవదీప్ తల్లిదండ్రులను ఓదార్చామన్నారు. డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, ప్రధాన ఉపాధ్యాయులు నారాయుడు, ఎఎంఒ కోటిబాబు, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆరిక భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు పరామర్శించారు.

పేరు పేదలది... ప్రయోజనం పెద్దలది

- ఐటిడిఎ నిధులతో మైనింగ్ కంపెనీకి రోడ్డు
- అధికారుల తీరు పట్ల గిరిజనుల ఆగ్రహం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పేదల పేరు చెప్పి ఆ నిధులను పెద్దలకు అధికారుల కట్టబెట్టిన వైనం పార్వతీపురం ఐటిడిఎలో జరుగుతోంది. గిరిజన గ్రామాల అభివృద్ధి పేరిట మంజూరైన నిధులను అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఓ మైనింగ్ కంపెనీకి రోడ్డు వేయడమే ఇందుకు నిదర్శనం. తమ గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని గిరిజనులు, ప్రజాసంఘాలు వేడుకున్నా పట్టించుకోని పాలకులు, అధికారులు ఒకేసారి రూ.2కోట్లు రోడ్డు పనులకు నిధులు కేటాయించడం పట్ల సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని చినగుడబ రెవెన్యూ పరిధిలోని మైనింగ్ కంపెనీ ఉంది. ఈ కంపెనీకి రోడ్డు వేసేందుకు రూ.2కోట్లుతో ప్రతిపాదనలు అధికారులు పంపడం పట్ల పలు ప్రజా సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ రోడ్డు వల్ల ఎవరికి ప్రయోజనమంటూ నిలదీస్తున్నాయి. ఇదే రోడ్డుకు మంజూరు చేసిన నిధులను కనీసం నడవడానికి అవకాశం లేని అనేక గిరిజన గ్రామాలున్నాయని, ఈ గ్రామాలకు ఇప్పటికీ వాహనాలు వెళ్లేందుకు మార్గాలు సరిగ్గా లేవని, అలాంటి గ్రామాలను విడిచిపెట్టి ఎవరి ప్రయోజనం కోసం మైనింగ్‌కంపెనీకి రోడ్డు వేసేందుకు నిధులు కేటాయిస్తున్నారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అలాగే పార్వతీపురం నుండి పాలకొండ వెళ్లే రహదారి గుంతలమయం కావడంతో వాహనదారులు నిత్యం తీవ్ర అవస్థలు పడుతున్నా పాలకులు పట్టించుకున్న పాపాన లేదు. అలాగే పార్వతీపురం నుంచి కొమరాడ వెళ్లే అంతర్‌రాష్ట్ర రహదారి గుంతలయమై అనేక మంది క్షతగాత్రులైనా పట్టించుకోలేని అధికారులు ఈ రహదారి పట్ల ఎందుకింత శ్రద్ధ చూపుతున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గిరిజనుల నిధులతో మైనింగ్ కంపెనీకి వేస్తున్న రోడ్డు

మైదాన ప్రాంత రోడ్లకు ఐటిడిఎ నిధులు కేటాయింపా?

గిరిజన ప్రాంతంలో మౌలిక వసతులు కల్పనకు వినియోగించాల్సిన ఐటిడిఎ సబ్ ప్లాన్ నిధులను మైదాన ప్రాంతంలో కొంతమంది క్వారీ యజమానులకు ప్రయోజనం కలిగించేందుకు వినియోగించడమేమిటి? ప్రజా ప్రయోజనం కంటే వ్యాపారుల ప్రయోజనాలకే పాలకులు, అధికారులు సహకరిస్తున్నారు. క్వారీ యజమానులకు మేలు చేసేందుకు రూ.2కోట్లు కేటాయించడం దారుణం. మైదాన ప్రాంత రోడ్ల నిర్మాణానికి పంచాయతీరాజ్, మండల పరిషత్ నుంచి నిధులు కేటాయించాలి తప్ప ఐటిడిఎ నుంచి నిధులు కేటాయించడంలో ఆంతర్యమేమిటి.

బివి రమణ,
సిపిఎం నాయకులు

అభివృద్ధి ఇదేనా?

ఐటిడిఎ నిధులు కేవలం గిరిజన సంక్షేమానికే ఖర్చు చేయాలి. గిరిజనేతరుల సంక్షేమం కోసం ఖర్చు చేయడం చట్ట విరుద్ధం. ఐటిడిఎ నిధులు దారిమళ్లిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులకు తెలియజేశాం. నిధుల మల్లింపు విషయంలో రాష్ట్ర గవర్నర్ స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

పి.రంజిత్‌కుమార్,
గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కన్వీనర్.

లక్ష్యాలు పూర్తిచేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పురోభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టరు మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాల మేరకు ప్రాధాన్యతా భవనాలు, జలజీవన్ మిషన్, హౌసింగు, గడపగడపకు మన ప్రభుత్వం పథకాలను సకాలంలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించిందని, లక్ష్యాలను అధికారులు గడువులోగా పూర్తిచేయాలని తెలిపారు. ప్రాధాన్యతా భవనాలను లక్ష్యం మేరకు పూర్తిచేయక పోవడంపై జిల్లా కలెక్టరు అసంతృప్తి వ్యక్తం చేశారు. పూర్తిచేసిన పనులకు చెల్లింపులు చేస్తున్నప్పటికీ, భవన నిర్మాణాలు లక్ష్యాలు చేరుకోవడం లేదని, నిర్మాణాలు పూర్తిచేసి బిల్లుల చెల్లింపుల కోసం పంపించాలని, భవనాలు సంబంధిత శాఖలకు అప్పగించనం తకాలం బిల్లులు పెండింగు ఉంటాయని, కావున భవనాలను పూర్తిచేసి బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలని తెలిపారు. జల జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి మంచినీరందించి, ఆ కుటుంబాల్లో ఆనందాన్ని కల్పించాలని సూచించారు. ఈ పథకం కింద లక్ష్యంమేరకు 50 వేల కుళాయి కనక్షన్లు వెంటనే పూర్తిచేయాలని తెలిపారు. విద్యాశాఖకు సంబంధించి టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించేందుకుగాను రూపొందించిన ప్రణాళిక ప్రకారం అధికారులు వారికి కేటాయించిన పాఠశాలలకు వారంలో రెండురోజులు పర్యటించాలన్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల విద్యాప్రమాణాలు చాలా తక్కువగా ఉన్నాయని, అటువంటి వారిని గుర్తించి, వారిపట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొనేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఉన్నతాధికారులు పాఠశాలలకు పర్యటించడం ద్వారా విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకొని మంచి భవిష్యత్తు పొందేందుకు, వారిలా ఉన్నత స్థానాలకు చేరాలనే ఆశయం కలిగి చదువుపట్ల శ్రద్ధ కనబరుస్తారని తెలిపారు. కావున విద్యార్థులకు మంచి మార్కులతో పాటు, నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రెండో విడత మెగా హౌసింగు డ్రైవ్‌లో భాగంగా ఫిబ్రవరి నాటికి రాష్ట్రంలో 5లక్షల గృహ నిర్మాణం పూర్తిచేసే కార్యక్రమంలో భాగంగా జిల్లాకు 10264 ఇళ్ల లక్ష్యంగా కేటాయించారని, సచివాలయం వారీగా ఇంజనీరింగు అసిస్టెంట్లకు లక్ష్యం కేటాయించామని, లక్ష్యాలు పూర్తి చేసేందుకు మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు, హౌసింగు, విద్యుత్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు సమన్వయంతో పనిచేసి లక్ష్యాన్ని పూర్తిచేయాలని తెలిపారు. రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితా తయారీ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని, వచ్చే నెలలో రోల్ అబ్జర్వర్ పర్యటన ఉంటుందని, సవరణకు సంబంధించి ఫారం-7 తిరస్కరించేటప్పుడు తప్పని సరిగా కారణాన్ని పొందుపర్చాలని తెలిపారు. సవరణకు సంబంధించి ఫారాలను గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. కళాశాలలలో 18 ఏళ్లు దాటిన వారినందర్నీ ఓటర్లుగా చేర్చాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన పిదప ప్రతి దశ కీలమేనని, బ్యాలెట్ ముద్రణ, పోస్టల్ బ్యాలెట్ పింపిణీ, నామినేషన్లు స్వీకరణ, పోలింగు ప్రక్రియలో ఎటువంటి అనుమానాలకు తావులేకుండా ముందు నుండి పూర్తి అవగాహన పెంచుకోవాలని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

అవార్డుకు సిఫార్సు చేయండి

గర్భిణీలు, బాలింతలు, బాలికలలో రక్తహీనత నివారణకు సంబంధించి రూపొందించిన ప్రణాళిక అమలు గూర్చి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలను రక్తహీనత నుండి కాపాడడంలో మెరుగైన పనితీరు కనబర్చినందుకు సీతానగరం మండలం బూర్జ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంటు పి.రోహిణిని గణతంత్ర దినోత్సవానికి అవార్డుకు సిఫార్సు చేయాల్సిందిగా ఎంపిడిఒ కృష్ణమహేష్ రెడ్డిని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు, డిఆర్ఒ జె.వెంకటరావు, పంచాయతీరాజ్ ఇఇ ఎంవిఆర్ కృష్ణాజీ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లాఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకర రావు, డిపిఒ బి.సత్యనారాయణ, డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

సమగ్రాభివృద్ధిపై సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - సాలూరు

జిల్లా సమగ్రాభివృద్ధిపై డిసెంబర్ 17న పార్వతీపురంలో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. మంగళవారం ఆయన స్థానిక సిఐటియు కార్యాలయంలో సిపిఎం మండల నాయకులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఏర్పడి ఏడాది దాటినా ఇంతవరకూ ఏ విధమైన ప్రణాళిక లేదని చెప్పారు. జిల్లాలో సాగునీరు, తాగునీరు లేని గ్రామాలు చాలా ఉన్నాయన్నారు. చెక్ డామ్‌లు, మినీ రిజర్వాయర్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. గిరిజన యువతకు ఉపాధి కోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. గిరిజనుల అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. మారుమూల గిరిజన గ్రామాలకు ఇప్పటికీ విద్య, వైద్యం అందని ద్రాక్షలా ఉన్నాయని చెప్పారు. గిరిశిఖర గ్రామాల గిరిజను లకు డోలీ మోతలు తప్పడం లేదన్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా సమగ్రాభివృద్ధిపై నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు, మండల అధ్యక్షులు గెమ్మెల జానకీరావు, కార్యదర్శి వంతల సుందరరావు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరగాలని, అందుకు సెక్టోరియల్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులు కీలకంగా వ్యవహరించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. పాలకొండ నియోజకవర్గం ఎన్నికల సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారుల శిక్షణా కార్యక్రమం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ సెక్టార్ అధికారులు, పోలీస్ అధికారులు విధులు నిర్వహణ బాధ్యతాయుతంగా చేయాలన్నారు. సమస్యాత్మక (క్రిటికల్), వల్నరబుల్ గ్రామాలను గుర్తించాలని ఆదేశించారు. అందుకు కారణమవుతున్న వ్యక్తులను గుర్తించాలని స్పష్టం చేశారు. ఇందుకు వివిధ వర్గాల నుంచి పూర్వ పరిస్థితులను సేకరించడం అవసరమని, అటువంటి పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఓటరు భయభ్రాంతులకు లోనుకాకుండా, ధైర్యంగా, ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో మావోయిస్ట్, రౌడీలు, ఇతర శక్తుల ప్రభావం గమనించాలని స్పష్టం చేశారు. ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ప్రభావితం చేసే వ్యక్తులను గుర్తించాలని పేర్కొన్నారు. ఓటుకు నగదు, బహుమతులు ఇవ్వడం వంటి అంశాలను గుర్తించాలని, ఓటును వేయకుండా ఎవరైనా భయభ్రాంతులకు గురి చేయడం, బెదిరించడం, ఓటు వినియోగించుకోరాదని ఆదేశించడం వంటి అంశాలను గుర్తించడం ముఖ్యమని ఆయన వివరించారు. ఒక వర్గాన్ని ఉద్దేశ్యపూర్వకంగా లక్ష్యంగా చేయడం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక ప్రదేశాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారదన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే వారిని కస్టడీలోకి తీసుకోవచ్చన్నారు. ఎన్నికల విధులను పూర్తి అప్రమత్తతతో చేపట్టాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాలు అమలు చేయాలని స్పష్టం చేశారు. సెక్టార్ అధికారులు ముందుగా తమ ప్రాంతాల్లో పర్యటించి, పూర్తి సమాచారం సేకరించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తోడ్పడాలని ఆయన అన్నారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అలక్ష్యం వహించరాదన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను తు.చ తప్పక పాటించాలని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల శిక్షణ విభాగం నోడల్ అధికారి, కెఆర్ఆర్సి ఎస్‌డిసి జి.కేశవ నాయుడు శిక్షణను నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకటరావు పాల్గొన్నారు.



జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

పూలే ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - సాలూరు

బడుగు వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే ఆశయాల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర చెప్పారు. మంగళవారం జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, సామాజిక కార్యకర్త జ్యోతిరావు పూలే ఆశయాలు, అడుగు జాడల్లోనే ప్రభుత్వం పని చేస్తున్నదని చెప్పారు. దీనిలో భాగంగానే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వంలో కీలకమైన పదవులు ఇచ్చిన సిఎం జగన్ మోహన్‌రెడ్డి సామాజిక సాధికారత దిశగా అడుగులు వేసినట్లు చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం హయాంలో లభించని విధంగా బడుగు వర్గాలకు గుర్తింపు లభించిందని రాజన్నదొర అన్నారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్ లు రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, గొర్లి వెంకటరమణ,జి.నాగేశ్వరరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ, వైసిపి నాయకులు తాడ్డి రమణ పాల్గొన్నారు.

30న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పార్వతీపురం టౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ బోను. గౌరీశ్వరి అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం జరుగుతుందని కమిషనర్ జె.రామప్పలనాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక సామాజిక భవనం ఎదురుగా కొత్తగా నిర్మించిన షాపులకు నెలసరి అద్దె రూ.4500 చెల్లింపు ప్రాతిపదికన గుడ్ విల్ మొత్తంపై రూ.2 లక్షలు డిపాజిట్‌తో కేటాయించేందుకు సీతంపేట పరిధిలో గల గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ కల్పనకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన గిరిజన అభ్యర్థులు డిసెంబర్ 6లోగా ఐటిడిఎ, సీతంపేట కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని పీవో కోరారు. పూర్తి వివరాలకు 9392917692 నంబరుకు సంప్రదించాలని కోరారు.

రానున్న నాలుగు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు

కురుపాం : రానున్న నాలుగు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ టిఎస్ఎస్‌కె పాత్రో, జిల్లా వాతావరణ విభాగ శాస్త్రవేత్త కె.ప్రశాంత్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ భారత వాతావరణ కేంద్ర సమాచారం ప్రకారం దక్షిణ అండమాన్ సముద్రం మీదుగా ఏర్పడిన అల్పపీడనం నవంబర్ 30న అగ్నేయ బంగాళాఖాతంలో 48 గంటల్లో తుఫానుగా మారే అవకాశం ఉందన్నారు. డిసెంబర్ 4 నుండి 6 వరకు కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాజశేఖర్

ఐదో రోజు కొనసాగిన ఎస్ఎఫ్ఐ దీక్షలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

జిల్లా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు చేపట్టిన నిరాహారదీక్షలు మంగళవారం ఐదో రోజుకు చేరుకున్నారు. ఈ దీక్షలనుద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.రాజశేఖర్ ఆధ్వర్యాన జరిగిన దీక్షలనుద్దేశించి వక్తలు మాట్లాడుతూ కనీస సౌకర్యాల్లేక విద్యార్థుల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందని, కనీసం పాలక ప్రభుత్వాలు వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల్లేకపోవడం అన్యాయమని, మన్యం జిల్లా అనే పేరు పెట్టి, జిల్లా వాసులను అడవుల్లో ఉన్న జంతువుల్లా ప్రభుత్వ వర్గాలు చూస్తున్నాయని, ఇది దారుణమని ఖండించారు. ఎన్నో ఏళ్లుగా విద్యార్థులు అనేక మౌలిక సదుపాయాల్లేక ఇబ్బందులు పడుతుంటే అధికారులకు పట్టడం లేదని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని హాస్టళ్లలో ఈనాటికీ మరుగుదొడ్లు లేక ఆరుబయటకు విద్యార్థిని, విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడం బాధాకరమని, వెంటనే అధికారులు స్పందించి మరుగుదొడ్లు, మౌలికసదుపాయాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యారంగ అభివృద్ధికి ఎస్ఎఫ్ఐ చేస్తున్న పోరాటం చాలా అద్భుతమైందని కొనియాడారు. కార్యక్రమంలో, జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజు, కమిటీ సభ్యులు సురేష్, ధనుంజయరావు, ముఖేష్, శ్రావణ్, జనసేన కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరి

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబరు 8 నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెను అంగన్వాడీలంతా పాల్గొని జయప్రదం చేయాలని, ఈ సమ్మెకు అన్ని వర్గాల ప్రజల మద్దతు నిలవాలని ఎపిఅంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక ఐసిడిఎస్ రూరల్ కార్యాలయ ఆవరణలో సాలూరు రూరల్ గ్రామీణ ప్రాంతాల వర్కర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్వాడీలకు అధికారం వస్తే తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇస్తామని వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెప్పారని, నేటికీ అమలు చేయలేదని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాల్సి ఉన్నా చేయడం లేదని అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు, జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వర్కర్‌తో సమానంగా జీతాలు ఇవ్వాలని, హెల్పర్ల వయోపరిమితి 50 ఏళ్లకు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేసి, యాప్ కుదించాలని డిమాండ్ చేశారు. సర్వీస్‌లో ఉండి చనిపోయిన వారికి వారి కుటుంబంలో ఉద్యోగం ఇవ్వాలని, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అన్ని వర్గాలు అండగా నిలవాలని, సిఐటియు కూడా అండగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శశికళ, హారిక నారాయణమ్మ, సెక్టార్ నాయకులు పార్వతి, అరుణ, గౌరి, సుభద్ర, తిరుపతమ్మ, రాజమ్మ, సుజాత, మరియమ్మ, పుష్ప, ఉత్తరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : డిసెంబర్ 8నుంచి నిరవధిక సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలపాలని జెడ్‌పిటిసి సభ్యులు అలజంగి రవికుమార్‌కు సమ్మె నోటీస్ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతిలక్ష్మి, ప్రాజెక్టు నాయకులు కె.దాలమ్మ అందజేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, టిఎ బిల్లులు, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని, ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని తదితర సమస్యపై డిసెంబర్ 8న తలపెట్టిన నిరవధిక సమ్మెకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు, సెక్టార్ లీడర్లు పాల్గొన్నారు.

సాలూరు : అంగన్‌వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న ఉమామహేశ్వరి

కొమరాడ : సమస్యల పరిష్కారం కోరుతూ డిసెంబర్ 8న రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు చేపడుతున్న నిరవధిక సమ్మెకు మద్దతు కోరుతూ మండలంలోని ప్రజాప్రతినిధులకు గ్రామ పెద్దలకు వినతిపత్రం అందజేశారు. ఇందులో భాగంగా సివిని సర్పంచ్ బోనెల పుష్పమ్మకు, గ్రామ పెద్ద పొట్నూరు వెంకటనాయుడుకు, వైస్ ప్రెసిడెంట్ అధికారి సురేష్‌కు, వాలంటీర్లకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ నాయకులు రాధారాణి, సునీత, సిఐటియు మండల నాయకులు కొల్లి సాంబమూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్ఎం ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్యానెల్ గ్రేడ్ ప్రధానోపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించిన ప్రక్రియ చేపట్టి నియామకాలు జరపాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్. మురళీమోహనరావు అన్నారు. ఇప్పటికే ఈ ప్రమోషన్ల కోసం చాలాసార్లు ఐటిడిఎ డిడి, పిఒకు తెలిపినా ఎటువంటి ప్రయోజనం లేదని అన్నారు. పిజి హెచ్ఎంకు అర్హులైన అభ్యర్థుల సీనియార్టీ జాబితాను విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ డైరెక్టర్‌కు రాసిన క్లారిఫికేషన్ లెటర్, అక్కడి నుండి వచ్చిన సమాధానం కాపీ తమకు ఇవ్వాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ ప్రమోషన్స్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక పోలీస్ స్టేషన్‌ను డిఎస్‌పి జివి కృష్ణారావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో ఏడాది కాలంగా ఉన్న క్రైమ్ తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం సామాజిక సాధికారిక బస్సు యాత్ర జరుగు సభా స్థలాన్ని పరిశీలించి వాహనాల రాకపోకలకు ఇచ్చిన రూట్ మ్యాప్ గూర్చి అడిగి తెలుసుకొని ప్రయాణికులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ, స్థానిక ఎస్సై సిహెచ్ ప్రసాద్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి కృష్ణారావు

ప్రజాశక్తి
www.prajasakti.com

బిసిలకు రాజ్యాధికారం అందించిన పూలే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వెనుకబడిన కులాలకు రాజ్యాధికారం అందించిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని, సాంఘిక దురాచారాలను రూపుమాపిన మహనీయుడని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్ఆర్ మార్క్ కూడలి వద్ద పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమక్షంలో జ్యోతిరావు పూలే 133వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక కార్యకర్త, కుల వ్యతిరేక సంఘ సంస్కర్త, రచయిత, అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన, మహిళలు, అణగారిన కులాల ప్రజలకు విద్యను అందించడంలో ఆయన చేసిన కృషితో మరువలేనివన్నారు. భావి భారతదేశానికి ఒక గొప్ప సంస్కర్తగా నిలిచిన మహనీయులు మహాత్మ జ్యోతిరావు పూలే అని, అతని భార్య సావిత్రిబాయి పూలే భారతదేశంలో స్త్రీల విద్యకు మార్గదర్శకులని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్, వైస్ చైర్మన్లు, మూడు మండలాల, పట్టణ పార్టీ అధ్యక్షులు, జడ్పిటిసి సభ్యులు, ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు, జెసిఎస్ కన్వీనర్లు, వైసిపి సీనియర్ నాయకులు, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, స్టేట్ డైరెక్టర్లు, పిఎసిఎస్ చైర్మన్లు, ఎఎంసి డైరెక్టర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారధులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జియ్యమ్మవలస మండలం చినమేరంగి క్యాంప్ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, టిటిడి డైరెక్టర్ జమ్మాన ప్రసన్నకుమార్ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ : మహాత్మా జ్యోతిరావు పూలే గారి వర్ధంతి సందర్భంగా వైసిపి నాయకులు పాలవలస రాజశేఖరం నివాసం వద్ద పట్టణ వైసిపి అధ్యక్షులు వెలమల మన్మధరావు ఆధ్వర్యంలో ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాలవలస ధవళేశ్వరరావు, కౌన్సిలర్లు కిలారి మోహనరావు, దుప్పాడ పాపినాయుడు, కె.విజయకుమార్, దుంపల రమేష్, పీల అక్కలనాయుడు, నెరద బిల్లి ప్రసాద్, వప్పంగి చంద్ర మౌళి, కూనిబిల్లి సూరి తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని జ్యోతిబాపూలే వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నడుకూరు, బొడ్డపాడులో జనసేన నాయకులు బిపి నాయుడు, ఎం.పండరీరావు, జనసేన జానీ జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కె.సాయి పవన్, చింత గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఐద్వా నాయకులు వి.ఇందిర ఆధ్వర్యంలో ఘనంగా నివాళ్లు అర్పించారు. స్థానిక ప్రభుత్వ కాలేజీ విద్యార్థులకు సమాజంలో జరుగుతున్న అనేక ర్యాగింగ్. మత్తు పదార్థాలు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా ఎస్సై జి పైడ్రాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డి.మంజుల వాణి, అధ్యాపకులు ఎం.శ్రీనివాసరావు, ఎస్.మల్లేశ్వరి కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : పట్టణంలో మంగళవారం పలుచోట్ల మహాత్మా జ్యోతిరావు పూలే 133వ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించుగా, నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు వేర్వేరుగా తమ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేస్తున్న ఎంపిపి, జెడ్‌పి వైస్‌చైర్మన్

పేదలకు భూ పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రైతులు సాగు చేసుకున్న భూములకు పూర్తి హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో రైతుల్లో ఆనందానికి అవధుల్లేవని ఎంపిపి ఉరిటి రామారావు, జెడ్‌పి వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు అన్నారు. స్థానిక తహశీల్దార్ గేదెల వెంకట జగన్నాథ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన భూహక్కు పత్రాలు పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అసైన్డ్ భూమిని దీర్ఘకాలికంగా సేద్యం చేస్తున్న రైతులకు భూమిపై సంపూర్ణ హక్కు కల్పించేందుకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.పైడితల్లి, రావుపల్లి సర్పంచ్ బొంతాడ మహేశ్వర రావు(మహేష్), డిటి పెద్దింటి సత్యలక్ష్మి కుమార్, వైసిపి నాయకులు బోను చంద్రశేఖరరావు, మూడడ్ల అప్పారావు, ముచ్చల సింహాచలం, బాణాల సురేష్, ఆక్కేన రామకృష్ణ, తూముల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేష్‌ను అభినందిస్తున్న టిడిపి నాయకులు

పట్టణ టిడిపి కార్యదర్శిగా మజ్జి వెంకటేష్

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

పట్టణంలో టిడిపిని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా టిడిపి పట్టణ కార్యదర్శిగా మజ్జి వెంకటేష్‌ను నియమిస్తున్నట్లు నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర మంగళవారం టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రకటించారు. ఆయన నియామకం పట్ల మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ చైర్పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, పట్టణ పార్టీ అధ్యక్షులు జి.రవికుమార్, కౌన్సిలర్లు కోల సరితా మధు, తాతపూడి వెంకటరావు, బడే గౌరినాయుడు, కె.నారాయణరావు తదితరులు ఆయన్ను అభినందించారు.

పాఠశాలల బలోపేతానికి చొరవ చూపాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు చొరవ చూపాలని మండల విద్యాశాఖ అధికారి-1 డి.గౌరునాయుడు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో యుడైస్ కార్యక్రమంలో మాట్లాడారు. పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, వారి వివరాలు ఆన్లైన్లో పొందుపర్చాలన్నారు. ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలకు చేరుకొని విద్యాభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎస్.సుంబోరా, సిహెచ్ రత్నాకర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నాటు సారా స్థావరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో నాటు సారా స్థావరాలపై ఎల్విన్‌పేట పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. మండలంలోని మంగన్నగూడ శివార్లలోని భూమి లోపల దాచి ఉన్న నాటు సారా, బెల్లం ఊట డ్రమ్ములను తవ్వి వెలికితీశారు. 500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. గ్రామాల్లో ఎవరైనా నాటు సారా వంటకాలు, అమ్మకాలు చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు సాంకేతిక పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమి ప్రాథమికోన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి భౌరోతు శ్రీనివాసరావు ఎల్ఇడి ప్రొజెక్టర్, డెల్ కంపెనీ కంప్యూటర్ సిస్టం, ఉపాధ్యాయులు ఆలబిల్లు శ్రీహరినాయుడు ప్రింటర్‌ను మంగళవారం అందజేశారు. ప్రొజెక్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న సర్పంచ్ డి.ఉమామహేశ్వరరావు, ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో విద్యార్థులకు డిజిటల్ ద్వారా విద్యా బోధన అందిస్తామన్నారు. కార్యక్రమంలో బి.శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు, సీఆర్పీ జగదీష్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవిపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని వైడిఒ నెట్వర్క్ అవుట్ రీచ్ వర్కర్ ఎ.గీతారాణి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు హెచ్ఐవి ఎయిడ్స్, సుఖ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజలకు, యువత, ట్రాన్స్ జెండర్‌లకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఐసిటిసి కేంద్రంలో ఎస్‌టిఐ పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైడిఒ నెట్వర్క్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీడర్ అంబులెన్సు డ్రైవర్ల హక్కుల సాధనకు కృషి

ప్రజాశక్తి - కురుపాం

ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తూ వారి హక్కుల సాధనకు వారితోపాటు ఉంటానని ట్రైబల్ రైట్స్ ఫారం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు అన్నారు. మంగళవారం కురుపాంలో జరిగిన ఫీడర్ అంబులెన్సుల డ్రైవర్ల సంఘం కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలు తెలుసుకుని సమస్యల సాధనకు కృషి హామీ ఇచ్చారు. అనంతరం ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్లు దుశ్శాలువాతో ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్ల సంఘం నాయకులు అశోక్ కుమార్, చెరుకుపల్లి రాజు, నరేష్, గోపి, ఎర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకు మహిళా పోలీసుల అభినందనలు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక పోలీసు స్టేషన్‌కు కొత్తగా వచ్చిన బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ ఎం.రాజేష్‌కుకో సచివాలయ మహిళా పోలీసులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నుంచి వచ్చిన మహిళా పోలీసులు పరిచయం చేసుకుంటూ గ్రామంలోని సమస్యలపై దృష్టి పెట్టాలని, వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలని వారు అన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామ సచివాలయ మహిళా పోలీసులు ఉన్నారు.

సంస్కృత పాఠశాలకు దాతల సహకారం

పార్వతీపురం టౌన్ : స్థానిక జిల్లా పరిషత్ సంస్కృత ఉన్నత పాఠశాలకు దాతలు ఇచ్చిన రూ.35వేలును పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వేమకోటి నరహరశాస్త్రి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు మంచి పల్లి శ్రీరాములుమాస్టారు చేతుల మీదుగా మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.హేమ సుందర్ నాయుడుకు అందజేశారు. సాలూరు పట్టణానికి చెందిన అజ్ఞాత రియల్ ఎస్టేట్ వ్యాపారి రూ.20వేలు, బలిజిపేటకు ప్రముఖ సామాజికవేత్త వెలిది సుబ్బారావు రెండు టేబుల్పు, యువ నాయకుడు బండారు శ్రీనివాసరావు రూ.2500, సాలూరు సంస్కృత పండితులు హరిచందన్ మాస్టారు రూ.5000, పార్వతీపురం వాసవి క్లబ్ రూ.3,500, వరద ఉదయ్ కుమార్ (వైష్ణవి జ్యూయలర్సు) రూ.3500 అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆకుల శ్రీనివాస్, ఐఆర్‌డబ్ల్యుఎ- ఎన్జీవో సంఘం సభ్యులు గణేష్ పాల్గొని పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు.



చెక్కును అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ నరహరశాస్త్రి

సమస్యలు పరిష్కారం కాని బస్సుయాత్ర ఎందుకు?

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారం కానీ సామాజిక బస్సుయాత్ర ఎందుకని టిడిపి అరుకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి ఎన్.కృష్ణబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో మండల కన్వీనర్ కె.వి కొండయ్య ఆధ్వర్యంలో జనసేన, టిడిపి ఉమ్మడిగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్య అయిన గుమ్మడిగెడ్డ, పూర్ణపాడు లాభేసు వంతెన పనులు పూర్తి చేయకుండా రైతుల సమస్యలు పరిష్కరించనందుకా, నియోజకవర్గంలో ఏనుగులు గుంపు దీర్ఘకాలికంగా సంచరిస్తూ ప్రజల ప్రాణాలను, పంటలను నాశనం చేసినందుకా సామాజిక బస్సు యాత్ర చేపడుతున్నారని ప్రశ్నించారు. అలాగే నిరుద్యోగ సమస్య కొట్టుమిట్టాడుతున్నందుకా ప్రభుత్వం సమాధానం చెప్పి ప్రజల ముందుకు రావాలని అన్నారు. అలాగే నియోజవర్గ కేంద్రంలో దీర్ఘకాలికంగా గుంతల మయమైన రహదారిని బస్సుయాత్ర నేపథ్యంలో గుంతలను కప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని, ఈ ప్రభుత్వానికి ఇంకా నాలుగు నెలల సమయం మాత్రమే ఉందని, ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ప్రజలు ఎదురు చూస్తున్నారని ఖచ్చితంగా ఈ వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. విలేకరుల సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కడ్రక మల్లేశ్వరరావు, టిడిపి నాయకులు కిమిడి రామరాజు, జనసేన నాయకులు ఎన్. వంశీ , ఉపేంద్ర, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - సాలూరు

సేంద్రియ పంటల సాగుపై గిరిజన రైతులు అవగాహన పెంచుకోవాలని నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు కోరారు. మండలంలోని చినబారిగాంలో నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన గిరిజన రైతులకు సేంద్రియ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడ్వాంటా కంపెనీకి చెందిన 12రకాల కూరగాయల విత్తనాలను 70మంది గిరిజన రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగుతో ఆశించిన దిగుబడి సాధించవచ్చునని చెప్పారు. సేంద్రియ కూరగాయలకు మార్కెట్‌లో డిమాండ్ ఉందన్నారు. ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా సేంద్రియ కూరగాయల వినియోగం పెరిగిందన్నారు. ప్రాజెక్టు ఎఒ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ భవిష్యత్తులో సేంద్రియ పంటల సాగు చేస్తున్న రైతులకు డిమాండ్ పెరుగుతుందని చెప్పారు. ఇంటి పక్కనున్న పెరట్లో గానీ, వ్యవసాయ భూమిలో గానీ సేంద్రియ పంటల సాగు చేయవచ్చునని చెప్పారు. అడ్వాంటా కంపెనీ కన్సల్టెంట్ రాధా మోదామెల్ మాట్లాడుతూ సేంద్రియ పంటల సాగులో అవసరమైన మెలకువలను రైతులకు అందిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సబ్ అసిస్టెంట్ సుబ్బరాజు, నీడ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది మహేష్, రామకష్ణ పాల్గొన్నారు.

గిరిజన రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ

రైతులనుద్దేశించి మాట్లాడుతున్న నీడ్ డైరెక్టర్ వేణుగోపాలరావు

సమస్యలు తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని సమస్యలు తెలియజేస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపిపి శెట్టి శ్యామల అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి హాజరయ్యారు. అనంతరం వివిధ శాఖ అధికారులు అభివృద్ధి నివేదికలు చదివి వినిపించారు. తొలుత మండల వ్యవసాయ శాఖ అధికారి శంకరరావు మాట్లాడుతూ డిసెంబర్ మొదటి వారం నుండి దాన్ని కొనుగోలు చేపట్టేందుకు అన్ని చర్యలు చేపట్టమన్నారు. ధాన్యం కొనుగోలుకు ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల వద్ద ఖాళీ బస్తాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ఇ-క్రాప్ నమోదు చేస్తేనే రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర కొనుగోలు జరుగుతుందన్నారు. మండలంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని జలజీవన్ మిషన్ ద్వారా వేసిన ఇంటింటి కుళాయిలు సక్రమంగా పనిచేయడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అప్పారావు, తహశీల్దార్ మల్లికార్జునరావు, వైఎస్ ఎంపిపి శరత్‌బాబు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వివిధ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న డిసిఐసి నాగమణి

చట్టాలపై విద్యార్థులకు అవగాహన : డిసిఐసి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సమాచార కేంద్ర నిర్వాహకులు (డిసిఐసి) పట్నాయకుని నాగమణి వినియోగదారుల హక్కుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణలో తమ పాత్ర గురించి విద్యార్థులకు పరిజ్ఞానం కలిగించి తద్వారా వారి తల్లిదండ్రులను చైతన్యవంతులను చేసేలా అవగాహన సదస్సులు ఎంతగానో దోహదపడతా యన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, సౌకర్యాలు, సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఏ విధంగా సంప్రదించాలనే అంశాలను వివరించారు. ఏ సమస్యను ఎవరికి ఫిర్యాదు చేయాలి, పరిష్కార మార్గాలు ఏమిటనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు కల్తీలను కనిపెట్టడం, విద్యా, ఆరోగ్య పరిరక్షణ వంటి కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం వల్ల వారిలో బాధ్యతాయుతమైన ప్రవృత్తి పెరుగుతుందన్నారు. వినియోగదారులు న్యాయం చేయాలని, రాతపూర్వకంగా, అంతర్జాలం ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. 1967/18004250082 ఫోన్ చేసి ముఖ్యమైన సమాచారం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బిడ్డిక భీముడు, పాఠశాల వినియోగదారుల క్లబ్ నిర్వాహకులు ప్రమీల, మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేదారిపురంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కేదారిపురం సబ్ సెంటర్‌లో 104 ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి సేవలు పొందారు. చలికాలంలో చిన్నారులు, వృద్ధులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు పి. రాధాకష్ణ, సచివాలయ ఎఎన్ఎం బి.విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి ఆర్. హెప్సిబా, డేటా ఎంట్రీ ఆపరేటర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ డిపాజిట్‌దారుల దశల వారీ పోరాటం

పార్వతీపురం రూరల్: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు మన ప్రభుత్వం గెలిస్తే అగ్రిగోల్డ్ బాధితులందరికీ పూర్తిగా డబ్బులు చెల్లిస్తానని చెప్పిన తీరా అధికారంలోకి వచ్చాక మాట తప్పి మడమ తిప్పారని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఇవి నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎపిఎన్‌జిఒ హోంలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిపాజిట్‌దార్లకు న్యాయం జరిగేంత వరకూ దశల వారీగా పోరాటాలు చేస్తామన్నారు.

బడ్జెట్‌కు ఆమోదం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం బడ్జెట్ ఆమోదం నిమిత్తం నిర్వహించిన సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉరిటి రామారావు అధ్యక్షతన మండల బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది సవరణ బడ్జెట్లో రూ.20,70,072 కాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.26,03,193 రాబడులుగా వచ్చునని పొందుపరిచారు. అలాగే మహిళా, శిశుసంక్షేమానికి 15శాతం, ఎస్‌సి సంక్షేమానికి 15శాతం, ఎస్‌టిల సంక్షేమానికి 6శాతం, అభివృద్ధి పనుల నిమిత్తం 23శాతం, అత్యవసర పరిస్థితుల్లో మంచినీటి సమస్య కోసం 12 శాతం, పరిపాలన ఖర్చులు 15శాతం, కంటిన్యూజెన్సీ ఖర్చుల కింద నాలుగు శాతం నిధులు వ్యయం నిమిత్తం పొందుపరిచారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ జి.పైడితల్లి, వైస్ ఎంపిపి భత్తల లక్ష్మి, ఎంపిటిసి సభ్యులు కోట భరత్ కుమార్, మరడాన సింహాచలంనాయుడు, పిల్లా భుజంగరావు, చింతల రూపవతి, దేవాతి నారాయణమ్మ, గుంట్రెడ్డి అన్నపూర్ణమ్మ, యామల పార్వతి, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ నాలి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన్న డ్రైనేజీ వ్యవస్థతో ప్రజలకు అవస్థలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పట్టణంలోని మురుగు కాలువల నిర్వహణ అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని పదో వార్డులో మంగళవారం ఆయన పర్యటించి రోడ్లు, వీధిలైట్ల నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థను మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ చైర్పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవితో కలిసి పరిశీలించారు. డ్రైనేజ్ వ్యవస్థను చూసి ఆందోళన చెందారు. డ్రైనేజీలో మురికినీరు నిల్వ ఉండడం వల్ల దోమలు, దుర్వాసనతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు కానీ, మున్సిపల్ అధికారులు కానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వార్డులో ప్రజలను కలిసి గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీ పరిపాలన ప్రస్తుత పరిపాలనతో బేరీజు వేసుకోవాలని, టిడిపిని బలపరిచి చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోల సరితా మధు, బడే గౌరు నాయుడు, పోల సత్యనారాయణ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తూరుమామిడిలో భూ రీసర్వే

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని తూరు మామిడి పంచాయతీలో భూముల సర్వే కార్యక్రమం మంగళవారం జరిగింది. సుమారు 1279 ఎకరాలు ఉండగా ఇందులో 400 ఎకరాలకు పైబడి ప్రభుత్వం భూమి ఉంది. ప్రస్తుతం 60 ఎకరాల్లో ఈ సర్వే చేపట్టడం జరిగింది. రికార్డుల ప్రకారం పంచాయతీలో 35 చెరువులున్నాయి. ఈ సర్వే సందర్భంగా ప్రభుత్వ భూములు చెరువులకు సంబంధించి మరిన్ని సమగ్రమైన వివరాలు అందించడం జరుగుతుందని సర్వేయర్ జి.గణేష్ తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఒ రూపవతి, స్థానిక సర్పంచ్ ఆర్.కృష్ణంనాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూములను సర్వే చేస్తున్న అధికారులు

సాగు భూములకు పట్టాలివ్వాలి

తహశీల్దార్‌కు గిరిజన సంఘం వినతి

ప్రజాశక్తి - సాలూరు

మండలంలో గిరిజ నులు సాగు చేస్తున్న అటవీ, బంజరు, అన్ సర్వే భూములకు పట్టాలు ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షులు గెమ్మెల జానకీరావు, కార్యదర్శి వంతల సుందరరావు కోరారు. మంగళవారం వారు స్థానిక తహశీల్దార్ బాలమురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు సాగు చేస్తున్న భూములను సర్వే చేయకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారని చెప్పారు. కొన్ని గ్రామాల్లో సర్వే చేసినా పట్టాలు పంపిణీ చేయలేదని చెప్పారు. పట్టాలు లేకపోవడంతో గిరిజన రైతులు ప్రభుత్వ రాయితీలు పొందలేకపోతున్నారన్నారు. వెంటనే సాగు చేస్తున్న భూములను సర్వే చేసి పట్టాలు పంపిణీ చేయాలని గిరిజన సంఘం అధ్యక్షులు గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం సభ్యులు వున్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి : డిఐఒ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందజేసే దిశగా వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన వల్లరగుడబలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను మంగళవారం తనిఖీ చేశారు. వైద్య పరీక్షల కోసం అక్కడకు వచ్చిన ప్రజలతో ఆయన మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రికార్డులో నమోదు చేసిన రోగుల ఆరోగ్య తనిఖీలు, పరీక్షల వివరాలు పరిశీలించారు. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు, అలాగే సీజనల్‌గా సోకే అనారోగ్య లక్షణాలతో గుర్తించిన వారికి అందజేసిన చికిత్స వివరాలు పరిశీలించారు. 104 వాహనంలో గర్భిణులకు, హృద్రోగుల సమస్యలున్న వారికి తీసిన ఇసిజి నివేదికలను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం డాక్టర్ జగన్మోహనరావు వైద్య సిబ్బందితో అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ పిల్లల ఆరోగ్య పరిశీలన చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య వివరాలపై ఆరా తీసి రక్తహీనతకు గురికాకుండా ఐరన్ మాత్రలు వేయించాలన్నారు. పరిశుభ్రత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కెకె.సాగర్ వర్మ, సూపర్వైజర్ జయగౌడ్,వైద్య సిబ్బంది ఈశ్వరమ్మ, మౌనిక, ఉపాధ్యాయులు విష్ణుమూర్తి, రామకృష్ణ, 104 సిబ్బంది దుర్గారావు, అనిల్, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

వైసిపి పాలనలో ఉపాధి కరువు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీలో కొత్తవలస, చింతలపాడు, కొల్లిగూడలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను గిరిజనులకు వివరించారు. గిరిజన బతుకుల్లో వెలుగు రేఖలు నిండాలంటే రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం క్లస్టర్ ఇంచార్జ్ ధర్మారావు, యూనిట్ ఇన్చార్జ్ అనిల్, బూత్ ఇంచార్జ్‌లు చిరంజీవి, అన్ని బాబు, రమేష్, సుందరరావు, జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : బాబు స్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలో వివిధ బూత్‌ల్లో ముమ్మరంగా ప్రచారం జరిగింది. చినభోగిలి బూతు నెంబర్ 154లో బూత్ ఇన్‌ఛార్జి నడగా వెంకయ్య ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు కొల్లి తిరుపతిరావు, క్లస్టర్ ఇంచార్జ్ బొమ్మి నాయూని లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ సబ్బాన జగన్నాథం, సీనియర్ నాయకులు మర్రాపు శంకర్రావు, కుడితి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

భూములను పరిశీలించిన దేవాదాయ అధికారులు

ఆధారాల కోసం తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని వడ్డివీధి రామమందిరం పేరిట ఉన్న భూములను మంగళవారం దేవాదాయ శాఖ అధికారులు పరిశీలించారు. 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి స్పందిస్తూ జిల్లా దేవాదాయ శాఖ ఎసి విచారణ జరపాలని కింద స్థాయి అధికారులను ఆదేశించారు. దీంతో బొబ్బిలి దేవాదాయ శాఖ ఇన్ స్పెక్టర్ రాజకుమారి, రామమందిరం ఇఒ ప్రసాదరావు సర్వే నెంబర్ 52/1 నుంచి 58/3లో వున్న భూములను పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ బాలమురళీకష్ణకి వినతిపత్రం అందజేశారు. ఆలయ భూములకు సంబంధించిన రెవిన్యూ రికార్డులను అందజేయాలని కోరారు. దీనిపై తహశీల్దార్ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ ఆలయ భూముల సర్వే నెంబర్లు దేవాదాయ శాఖ 43 రిజిస్టర్‌లో ఉన్నాయా అని దేవాదాయ అధికారులను ప్రశ్నించారు. 43 రిజిస్టర్‌లో లేవని ఆలయం ఇఒ ప్రసాదరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కొత్త ఇఒ రమేష్ కూడా పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని టిడిపి నాయకులు పడాల భూదేవి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో గిరిజన నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాల్లో ఏనుగుల దాడి వల్ల పంటలు పాడైపోయితున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏనుగుల సంరక్షణకు రేయింబవళ్ళ పనిచేస్తున్న ఎలిఫెంట్ ట్రేకర్స్‌కు ఉద్యోగ భద్రత లేకపోవడంతో పాటు ఇచ్చిన జీతాలు కూడా సకాలంలో ఇవ్వడంలేదని విమర్శించారు. అలాగే బీమా సౌకర్యం లేదన్నారు. కావున ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి నాయకులు సవర కుంపి, సవర గంగయ్య, సవర కూర్మారావు, చిన్నారావు, యూత్ లీడర్లు సవర శిమ్మయ్య, సవర శరత్ తదితరులు పాల్గొన్నారు.

చప్పబుచ్చంపేటలో 'వైనీడ్ జగన్'

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని చప్పబుచ్చింపేట పంచాయతీ పరిధిలో మంగళవారం ఆంధ్ర ప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి" కార్యక్రమం జరిగింది. స్థానిక వైసిపి నాయకులు చప్ప సూర్యనారాయణ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ జరిగింది. ముఖ్యఅతిథిగా వైసిపి మండల నాయకులు ఎం.రంగు నాయుడు పాల్గొన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి జగన్ ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలని, గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి గల వ్యత్యాసాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు చప్పా అన్నపూర్ణమ్మ, నోడల్ అధికారి దేవకుమార్ సచివాలయ సిబ్బంది , పాల్గొన్నారు

సీతానగరం : మండలంలోని బూర్జ సచివాలయ పరిధిలో జగనే మా నమ్మకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి ప్రతినిధి బి.శ్రీరాములునాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, కావున రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, గ్రామ సర్పంచ్ దాసు, ఎంపిటిసి సభ్యులు ఎం.చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.